
# మంత్రి కేటీఆర్ పర్యటనకు ముమ్మర ఏర్పాట్లు

- నేడు కొత్తూరు మున్సిపాలిటీ, చాకలిగుట్ట తండా గ్రామపంచాయతీ భవనాల ప్రారంభం, డబుల్ బెడ్రూం ఇండ్ల పంపిణీ చేయనున్న మంత్రి కేటీఆర్
- ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెలే అంజయ్యయాదవ్, సీఐ సురేశ్



కొత్తూరు : ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

కొత్తూరు, అక్టోబర్ 3: మంత్రి కేటీఆర్ ఈ నెల 5న కొత్తూరులో వివిధ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల్లో పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో మంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మంత్రి మొదట కొత్తూరుకు వచ్చి మున్సిపల్ కార్యాలయాన్ని ప్రారంభిస్తారన్నారు. అనంతరం డబుల్ బెడ్‌రూం ఇండ్లను లబ్ధిదారులకు అందజేస్తారని వివరించారు. ఆ తర్వాత షాద్‌నగర్ వెళ్తారని చెప్పారు. మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా అధికారులు ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నారాయణరెడ్డి, దేవేందర్‌యాదవ్, మున్సిపల్ కమిషనర్ వీరేందర్, సీఐ శంకర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు యాదగిరి పాల్గొన్నారు.



నందిగామ : నందిగామ మండలం చాకలిగుట్టతండా సర్పంచ్ రాజూనాయక్ ఆధ్వర్యంలో సకల హంగులతో చాకలిగుట్టతండా నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణం పూర్తయింది. ఈ నెల 5న రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌తో కలిసి ప్రారంభించనున్నారు. గురువారం ఉదయం హెలీప్యాడ్‌లో మంత్రి కేటీఆర్ చాకలిగుట్టతండా చేరుకొని గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించి, అక్కడే ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి, మహాత్మాగాంధీ, అంబేద్కర్ విగ్రహాలను ఆవిష్కరించనున్నట్లు సర్పంచ్ రాజూనాయక్ తెలిపారు. అనంతరం కొత్తూరు మున్సిపాలిటీ భవన ప్రారంభోత్సవ కార్యక్రమానికి వెళ్లనున్నట్లు తెలిపారు. నందిగామ సీఐ సురేశ్ మంగళవారం హెలీప్యాడ్ ల్యాండింగ్ స్థలాన్ని, మంత్రి పర్యటన ఏర్పాట్లను స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి పరిశీలించారు. పూర్తి బందోబస్తుతో ఏర్పాట్లు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



నందిగామ : చాకలిగుట్టతండాలో హెలీప్యాడ్ ల్యాండింగ్ స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ సురేశ్, బీఆర్ఎస్ నాయకులు



బీఆర్ఎస్‌లో చేరిన నాయకులు, కార్యకర్తలకు గులాబీ కండువా కప్పుతున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

# అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై..

- కృష్ణమ్మ నీళ్లతో నియోజకవర్గ పాదాలు కడుగుతాం
- ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్
- పలు పార్టీల శ్రేణులు బీఆర్ఎస్‌లో చేరిక

ఆమనగల్లు, అక్టోబర్ 3 : ప్రజా సేవకే తన జీవితం అంకితమని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. వ్యవసాయ కుటుంబంలో జన్మించిన తాను సర్పంచ్‌గా, జడ్పీటీసీగా, బీసీ కార్పొరేషన్ చైర్మన్‌గా, మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా ప్రజలకు సేవ చేస్తూ ముందుకు వెళ్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆమనగల్లులోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో కల్వకుర్తి మండలం తర్నికల్ గ్రామం, తలకొండపల్లి మండలం చుక్కాపూర్ గ్రామానికి చెందిన సుమారు 200 మంది బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రవేశపెడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు చూసి కేసీఆర్‌కు మద్దతుగా వివిధ పార్టీలకు చెందిన వారు బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకు కల్వకుర్తి నియోజకవర్గానికి అభివృద్ధి పనుల కోసం సుమారు రూ.5 వేల కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు.

నియోజకవర్గంలో 1100 మందికి దళిత బంధు అందజేయనున్నట్లు చెప్పారు. గృహలక్ష్మి కింద 4 వేల మందికి రూ.3లక్షలు, మైనార్టీలు, ఎంబీసీ కులాలకు రూ.లక్ష పూర్తి సబ్సిడీతో అందజేయనున్నట్లు వివరించారు. ఎంజీకేఎల్ఐ, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా లక్షల ఎకరాలకు సాగు నీరు అందటంతో పాడిపంటలతో తులతూగనున్నదని పేర్కొన్నారు. నియోజకవర్గంలో 1.50 లక్షల మందికి 50 రకాల బతుకమ్మ చీరలను, ప్రతీ గ్రామానికి ఒక క్రికెట్ కిట్‌ను కూడా అందజేయనున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజలు అన్నీ గమనిస్తున్నారని.. నియోజకవర్గంలో బీజేపీ, కాంగ్రెస్‌లకు చోటు లేదన్నారు. 70 వేల మంది బీఆర్ఎస్ క్రియాశీల కార్యకర్తలు ఉన్నారని.. ఏ జాతీయ పార్టీ బీఆర్ఎస్‌ను ఢీకొట్టే సత్తా లేదని ఎమ్మెల్యే తెలిపారు.

కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ గిరియాదవ్, మండల వైస్ ఎంపీపీ అనంతరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అర్జున్‌రావు, రై.స.స మండల అధ్యక్షుడు నారాయణ, కోనాపూర్ సర్పంచ్ మల్లమ్మ, ఎంపీటీసీ కుమార్, ఏఎంసీ డైరెక్టర్లు సుభాష్, రమేశ్, మున్సిపల్ అధ్యక్షుడు నేనావత్ పత్యానాయక్, సీనియర్ నాయకులు ఖలీల్, నిరంజన్‌గౌడ్, వెంకటయ్య, యాదయ్య, యువజన విభాగం నాయకులు ఉన్నారు.

# ఆడబిడ్డలు మెచ్చేలా.. నచ్చేలా..

- 250 డిజైన్లలో రూపుదిద్దుకున్న 'బతుకమ్మ' చీరలు
- ప్రతీ ఏటా ఆడబిడ్డలకు దసరా కానుకగా చీరలను అందజేస్తున్న సీఎం కేసీఆర్
- రంగారెడ్డి జిల్లావ్యాప్తంగా 7,37,646 మందికి చీరలను పంపిణీ చేయాలన్నది లక్ష్యం
- తొలి విడుతలో జిల్లాకు చేరిన 3,97,000 చీరలు
- గోడౌన్ల నుంచి మండలాలు, మున్సిపాలిటీలకు తరలింపు
- నేటి నుంచి పంపిణీ చేసేలా అధికారులు చర్యలు



గోడౌన్ నుంచి నిర్దేశిత ప్రాంతాలకు చీరలను తరలిస్తున్న సిబ్బంది

రంగారెడ్డి, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ) : మన సంస్కృతికి ప్రతీక.. అతివలకు అత్యంత ఇష్టమైన పండుగ.. దసరా పండుగను పురస్కరించుకుని ఈ ఏడాది కూడా తెలంగాణ ఆడబిడ్డలకు కానుకగా చీరలను అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ఇందుకనుగుణంగా 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఆడబిడ్డకు బతుకమ్మ చీరలను పంపిణీ చేసేలా అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. 250 డిజైన్లలో అతివలను ఆకట్టుకునే రీతిలో ప్రభుత్వం నేత కార్మికులతో చీరలను నేయించింది. రంగారెడ్డి జిల్లాలో ఇప్పటికే పౌరసరఫరాల శాఖ గోడౌన్ల నుంచి మండలాలు, మున్సిపాలిటీలకు చీరలు చేరాయి. నేటి నుంచి జిల్లావ్యాప్తంగా చీరల పంపిణీ కార్యక్రమం అట్టహాసంగా ప్రారంభం కానుంది. జిల్లా పరిధిలో తొలి విడుతలో 3,97,000 మంది అతివలకు చీరలను పంపిణీ చేయనున్నారు.



## విభిన్న డిజైన్లలో..

తొమ్మిది రోజులపాటు సందడి వాతావరణంలో జరిగే తీరొక్క పూల పండుగను అతివలు ఆనందంగా జరుపుకొనేలా ప్రతి యేటా తెలంగాణ ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నది. ప్రతీ ఆడబిడ్డను తోబుట్టువుగా గౌరవిస్తూ సారెగా చీరను అందించాలని సంకల్పించిన సీఎం కేసీఆర్ ప్రతి యేటా దసరాకు ముందుగానే చీరలను అందజేస్తున్నారు. ఈ ఏడాది కూడా ఆడపడుచులు సంతోషంగా వేడుకలను జరుపుకొనేలా చీరలను కానుకగా ప్రభుత్వం ఇవ్వనున్నది. 250 విభిన్న డిజైన్లలో రకరకాల రంగులతో అందంగా, నాణ్యతగా ఉండేలా సిరిసిల్ల కార్మికులతో ప్రభుత్వం నేయించింది. పండుగకు ముందుగానే అర్హులైన మహిళలకు చీరలనందించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రతీ మహిళా మెచ్చేలా.. నచ్చేలా నాణ్యమైన వస్త్రాలతో ప్రభుత్వం చీరలను నేయించిందని అధికారులు చెబుతున్నారు.

## నేటి నుంచి చీరెల పంపిణీ

జిల్లావ్యాప్తంగా 5.59 లక్షల ఆహార భద్రత కార్డులుండగా.. 18 ఏండ్లు నిండినవారు 7,37,646 మంది ఉన్నారు. ఈమేరకు పౌరసరఫరాల శాఖ అధికారులు అర్హులైన వారి జాబితాను మండలాలవారీగా రూపొందించి ప్రభుత్వానికి నివేదించింది. అందుకనుగుణంగా సర్కారు జిల్లాకు చీరలను కేటాయించింది. రెండు రోజుల క్రితమే ఆమనగల్లు, శంకర్‌పల్లి, మంచాలలోని పౌరసరఫరాల శాఖ గోడౌన్లకు చీరలు చేరాయి. మంగళవారం అన్ని మున్సిపాలిటీలు, మండలాలకు చీరలను తరలించారు. చీరలను అన్ని శాఖల సమన్వయంతో పంపిణీ చేసేలా టెస్కో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాస్థాయిలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, చేనేత జౌళి శాఖలు, రెవెన్యూ డివిజన్ స్థాయిలో ఆర్డీవో, మండలస్థాయిలో ఎంపీడీవో, తహసీల్దార్, గ్రామస్థాయిలో పలు శాఖల సిబ్బంది సహకారంతో చీరలను పంపిణీ చేయనున్నారు. బుధవారం మంత్రి సబితారెడ్డి కౌకుంట్లతోపాటు శంకర్‌పల్లి మున్సిపాలిటీలో చీరల పంపిణీ చేయనున్నారు. మిగతాచోట్ల ఎమ్మెల్యేలు అందజేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

### మండలాలవారీగా చీరల పంపిణీ

| మండలం | చీరలు |
|---|---|
| శంకర్‌పల్లి | 14,000 |
| చేవెళ్ల | 17,500 |
| షాబాద్ | 15,600 |
| మొయినాబాద్ | 12,500 |
| కొందుర్గు | 8,000 |
| చౌదరిగూడెం | 8,500 |
| ఆమనగల్లు | 5,000 |
| తలకొండపల్లి | 11,500 |
| మాడ్గుల | 12,500 |
| కడ్తాల్ | 9,500 |
| కేశంపేట్ | 11,500 |
| ఫరూఖ్‌నగర్ | 16,000 |
| కొత్తూరు | 5,000 |
| నందిగామ | 8,200 |
| మహేశ్వరం | 15,000 |
| యాచారం | 12,500 |
| శంషాబాద్ | 13,000 |
| మంచాల | 12,000 |
| కందుకూరు | 15,500 |
| ఇబ్రహీంపట్నం | 8,500 |
| అబ్దుల్లాపూర్‌మెట్ | 9,000 |
| మొత్తం | 2,40,800 |

### నగర పంచాయతీ, మున్సిపాలిటీ, కార్పొరేషన్లలో చీరల పంపిణీ

| మున్సిపాలిటీ/ కార్పొరేషన్ | చీరలు |
|---|---|
| బండ్లగూడ | 3,200 |
| చందానగర్ | 11,000 |
| మణికొండ | 1,700 |
| నార్సింగి | 4,000 |
| రాజేంద్రనగర్ | 30,500 |
| శేరిలింగంపల్లి | 11,000 |
| శంకర్‌పల్లి | 5,000 |
| ఆమనగల్లు | 4,500 |
| ఫరూఖ్‌నగర్ | 6,500 |
| జల్‌పల్లి | 6,500 |
| కొత్తూరు | 3,200 |
| తుక్కుగూడ | 5,000 |
| బడంగ్‌పేట్ | 9,000 |
| ఇబ్రహీంపట్నం | 4,700 |
| సరూర్‌నగర్ | 8,500 |
| శంషాబాద్ | 7,000 |
| ఆదిబట్ల | 3,000 |
| హయత్‌నగర్ | 7,000 |
| జిల్లెలగూడ | 2,400 |
| ఎల్‌బీనగర్ | 10,000 |
| మీర్‌పేట్ | 2,000 |
| పెద్దఅంబర్‌పేట్ | 5,000 |
| తుర్కయాంజాల్ | 5,500 |
| మొత్తం | 1,56,200 |

### అర్హులందరికీ చీరలు అందించేందుకు చర్యలు

**- ప్రభాకర్, డీఆర్‌డీవో**



18 ఏండ్లు నిండిన మహిళల జాబితాను పౌర సరఫరాల శాఖ అందజేసింది. ఈ ప్రకారంగా ప్రభుత్వం చీరలను జిల్లాకు పంపించింది. తొలి విడుతలో 3.97 లక్షల చీరలను పంపిణీ చేస్తున్నాం. ఇంకా అవసరమైతే ఇండెంట్ పెట్టి చీరలను తెప్పించి అందజేస్తాం. రేషన్ దుకాణాల ద్వారా చీరలను పంపిణీ చేస్తున్నాం. అన్ని శాఖల సమన్వయంతో చీరల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా చర్యలు తీసుకుంటున్నాం.